

గూడెంలో అయ్యప్పస్వామి దేవాలయం



ఆలయంలో కొలువైన అయ్యప్పస్వామి విగ్రహం

# అభినవ శబరిమలై.. గూడెం గుట్ట

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొదలైన అయ్యప్ప దీక్షలు
- మార్మోగుతున్న శరణుఘోష.. అకుంఠిత దీక్షతో స్వాములు
- 41 రోజులపాటు ఊరూవాడా ఆధ్యాత్మిక వైభవం

దండేపల్లి, డిసెంబర్ 9 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అయ్యప్ప నామ స్మరణే మార్మోగుతోంది. దండేపల్లి మండలంలోని గూడెం శ్రీ అభినవ శబరిమలై అయ్యప్ప ఆలయంతోపాటు ఆదిలాబాద్ జిల్లాలోని చాంద, ఇచ్చోడ, సుంకిడి.. నిర్మల్ జిల్లాలోని కడ్తాల్, ఖానాపూర్.. మంచిర్యాల జిల్లాలో గూడెంతోపాటు జన్నారం, మంచిర్యాల, మందమర్రి, బెల్లంపెల్లి, చెన్నూర్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్‌లో అయ్యప్ప ఆలయాలు ఉన్నాయి. దీక్ష సమయంలో మాలధారణ, దీక్ష విరమణ సమయంలో ఇరుముడి కట్టుకుంటారు. ఉమ్మడి జిల్లాకు చెందిన అయ్యప్ప భక్తులు శబరిమలై వెళ్లలేని వారు గూడెం అయ్యప్ప ఆలయంలో దీక్ష విరమణ చేస్తారు.

### మాలధారణ ఇలా..

- గురుస్వాముల ద్వారా మాలధారణ చేయించుకోవాలి.
- నల్లరంగు దుస్తులను ధరించాలి.
- దీక్ష ముగిసే వరకు ఈ దుస్తులతోనే ఉండాలి.
- సమూహంగా ఆలయ సన్నిధానాల్లో లేదంటే ఒంటరిగా ఇళ్లలో ప్రత్యేక గదిలో పూజలు నిర్వహించుకోవచ్చు.
- నిర్ధేశిత పూజల తరువాత ఇరుముడి ఉంటుంది.
- నెయ్యి, బియ్యం, కొబ్బరికాయలు, పసుపు, కుంకుమలతో గురుస్వామి ఇరుముడి కడతారు.
- దీనిని ఎంతో పవిత్రంగా, అయ్యప్పస్వామి ప్రతిరూపంగా భావిస్తారు.

### నియమాల తోరణం..

- ప్రతిరోజూ సూర్యోదయానికి ముందు, సూర్యాస్త సమయాల్లో చన్నీటితో తలస్నానం ఆచరించాలి.
- కట్టి విడిచిన బట్టలను ఉతికి ఆరేసుకోవాలి.
- దేవాలయాల్లో, పూజ గదిలో దీపం వెలిగించి శరణుఘోష చేయాలి.



పదునెట్టాంబడి పూజ

- మధ్యాహ్నం చన్నీటిస్నానం చేసి స్వామికి శరణుఘోష చెప్పి సాత్వికాహారం భుజించాలి.
- సాయం సంధ్యలో కూడా స్నానమాచరించి భజనలు చేసి అల్పాహారాన్ని స్వీకరించాలి.
- మద్యపానం, ధూమపానాలకు దూరంగా ఉండాలి.
- పాదరక్షలు ధరించ కూడదు. అసభ్యకర సంభాషణ, కోపం అస్సలు పనికిరావు.
- ప్రతిరోజూ మూడు పూటలా శరణుఘోష పాటించాలి.
- పురుషులు వృద్ధాప్యం వచ్చే వరకు, ఆడవాళ్లు పదేళ్ల లోపు పిల్లలు, 50 యేండ్లు దాటిన వారు దీక్షను ఆచరించవచ్చు.
- దీక్షా కాలంలో తల, గడ్డం వెంట్రుకలు, గోళ్లను కత్తిరించకూడదు.

### మనిషి అహం వీడేలా..

అయ్యప్ప దీక్ష ద్వారా ఎదుటి వారిని గౌరవించడం, సహపంక్తి భోజనాలు చేయడం, సన్నిధానంలో అందరి కాళ్లకు నమస్కరించడం, అందరి ఇళ్లకు వెళ్లి భోజనం చేయడంతో సమాజంలో అందరం ఒక్కటే అన్న భావనను మదిలో పెంపొందించుకుంటారు. తమను తాము నియంత్రించుకోవడానికి ఉపయోగపడుతోంది. కులాల ప్రస్తావన అస్సలు ఉండకూడదు. సామాన్యుడు, పేద, ధనిక అనే తేడా చూపించకూడదు.

### శబరిమలకి ప్రత్యామ్నాయంగా గూడెం అయ్యప్ప ఆలయం..

41 రోజులపాటు నియమ నిష్ఠలతో దీక్షను చేపట్టి ఆ తరువాత శబరిమలై చేరుకొని స్వామికి ఇరుముడి సమర్పించి, నెయ్యితో అభిషేకం చేశాకే దీక్షను విరమిస్తారు. కానీ.. శబరిమలకి ప్రత్యామ్నాయంగా ఇరుముడి సమర్పణకు అవకాశం ఉన్న ఆలయం గూడెంలో ఉండడం విశేషం. అయ్యప్ప స్వాములు ఇరుముడికి ఇచ్చే ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. ఆ ఇరుముడిని తలపై పెట్టుకొని స్వామి శరణుఘోషతో శబరిగిరికి చేరుకొని ఏకశిలతో రూపొందించిన పదునెట్టాంబడి(పద్దెనిమిది మెట్లు) ఎక్కి ఆ తరువాత దానిని స్వామి వారికి సమర్పించడం, నెయ్యితో అభిషేకం చేశాక కానీ దీక్షను విరమించరు. తెలంగాణలో అయ్యప్ప ఆలయాలు చాలానే ఉన్నా పదునెట్టాంబడి ఉన్నవి చాలా తక్కువ. వాటిలో ప్రముఖమైనది గూడెం శ్రీ అభినవ శబరిమలై అయ్యప్ప ఆలయం.

### అభినవ శబరి గూడెం గుట్ట...

గోదావరి నదీ తీరంలో మంచిర్యాల జిల్లా కేంద్రం నుంచి దాదాపు 35 కిలో మీటర్ల దూరంలో గూడెం శ్రీ అభినవ శబరిమలై అయ్యప్ప ఆలయం ఉంది. ఇది తెలంగాణ అన్నవరంగా ప్రసిద్ధిగాంచిన శ్రీసత్యనారాయణస్వామి ఆలయానికి సమీపంలో ఉంది. ఈ ఆలయాన్ని అభినవ శబరిమలగా పిలుస్తారు. శబరిమల తరహాలోనే భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. మండల దీక్ష తరువాత ఏ కారణం చేతనైనా శబరిమలకు వెళ్లలేని వారు ఈ సన్నిధానంలోనే ఇరుముడిని సమర్పించి, నెయ్యితో అభిషేకం చేస్తారు. యేటా ఇక్కడ వేల మంది భక్తులు ఇక్కడికి వచ్చి దీక్షను విరమిస్తున్నారు.

### ఇక్కడే దీక్ష విరమణ చేస్తున్నారు



గూడెం శ్రీ అభినవ శబరిమలై అయ్యప్ప ఆలయాన్ని 1993లో నిర్మించాం. అప్పటి నుంచి ఉమ్మడి జిల్లా నుండే కాక కరీంనగర్, వరంగల్, నిజామాబాద్‌కు చెందిన అయ్యప్ప భక్తులు మాలధారణ ఇక్కడే చేసుకుంటున్నారు. శబరిమల వెళ్లలేని చాలా మంది ఇక్కడే దీక్ష విరమణ చేస్తున్నారు. యేటా అయ్యప్ప దీక్షాపరుల సంఖ్య పెరుగుతోంది. ఇప్పటి వరకు 48 సార్లు అయ్యప్ప దీక్ష తీసుకున్నా.

**- చక్రవర్తుల పురుషోత్తమాచార్యులు, గురుస్వామి, గూడెం అయ్యప్ప ఆలయ వ్యవస్థాపకులు**

### 30వ సారి మాలధారణ స్వీకరించా..



ఈ యేడాదితో 30వసారి మాలధారణ స్వీకరించా. అయ్యప్ప మాలధారణ స్వీకరించి, నిత్య పూజలతో గడిపితే అంతా మంచే జరుగుతుందని నమ్ముతా. శబరిమల వెళ్లి యేటా దీక్ష విరమిస్తా. కొన్ని సార్లు గూడెంలోనే దీక్ష విరమిస్తున్నా. అయ్యప్ప భక్తులు కచ్చితంగా క్రమశిక్షణ, పరిశుభ్రత పాటించాలి. ఎదుటివారిని గౌరవించాలి. నాలో శక్తి ఉన్నంత వరకు మాల వేస్తూనే ఉంటా.

**- పాడేటి లక్ష్మణ్‌గౌడ్, గురుస్వామి, తాళ్లపేట(దండేపల్లి).**

# కడుపులో పెట్టుకొని కాపాడుకున్నరు..

## స్వరాష్ట్రంలోనే సింగరేణికి పునర్వైభవం

- నష్టాలు, కష్టాలు తగ్గాయంటున్న కార్మికులు
- కారుణ్య నియామకాలు, ఇండ్లకు లోన్లు
- హామీలన్నీ నెరవేర్చి ఆదుకున్నరు..
- సంస్థను, కార్మిక కుటుంబాలను ఆదుకున్నది కేసీఆరే
- ఈ నెల 27న సింగరేణి ఎన్నికల నేపథ్యంలో కార్మికుల 'అసలు ముచ్చట' ఇదే..



మంచిర్యాల, డిసెంబర్ 9(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బొగ్గుబాయి పని అంటేనే గజ్జున వణకాల్సిన పరిస్థితి గతంలో ఉండేది. భూగర్భ గనుల్లో లోసీమ్‌లో డ్యూటీ చేసేందుకు పోతే తిరిగి రావాలని దేవుడిని మొక్కుకొని పోయేటోళ్లు. దినదిన గండంగా భయపడుతూ భిక్కుభిక్కుమంటూ పని చేసేటోళ్లు. భూ గర్భగనుల్లో చిన్నగా ఉన్న రంధ్రాల్లోకి వంగిపోయి బొగ్గును తవ్వుకొని తట్టలతో నెత్తి మీద పెట్టుకొని బయటికి తెచ్చి పోయాలంటే దుఃఖం వచ్చేది. ప్రకృతికి విరుద్ధంగా భూగర్భంలో రెండున్నర కిలోమీటర్లు లోపలికి నడిచిపోయి, రెండున్నర కిలోమీటర్లు తిరిగి రావడానికే సగం శక్తి వృథా అయ్యేది. కార్మికుల భద్రత అందని ద్రాక్షగా ఉండేది.

### స్వరాష్ట్రంలో సరికొత్త వెలుగులు..

తెలంగాణ వచ్చాక గడిచిన తొమ్మిదిన్నరేండ్లలో ప్రభుత్వ ప్రోత్సాహంతో సింగరేణి సంస్థ ఎన్నో విజయాలు సాధించింది. ఉమ్మడి పాలనలో నష్టాల్లో ఉన్న సంస్థ ఇప్పుడు లాభాలు చూస్తున్నది. బొగ్గు ఉత్పత్తితోపాటు కార్మికుల సంక్షేమంలోనూ దూసుకుపోతున్నది. తెలంగాణ ముఖ్యమంత్రిగా కేసీఆర్ తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాలు సింగరేణి కార్మికుల దశ, దిశను మార్చాయి. కార్మికులకు సంస్థ లాభాల్లో అత్యధిక లాభాలు వచ్చాయి. పని విధానం మెరుగుపడింది. భూగర్భ గనుల్లో ప్రమాదకరమైన ప్రదేశాల్లో ఒకప్పుడు మనిషి చేసే పని ఇప్పుడు మిషనరీ చేస్తున్నది. గనుల్లోకి నడిచివెళ్లే అక్కర లేకుండా మ్యాన్ రైడింగ్ వచ్చింది. కార్మికులకు భద్రత పెరిగింది. బ్లాస్టింగ్ పద్ధతులు మారాయి. సులభతరమైన పని విధానాలు వచ్చాయని కార్మికులు చెబుతున్నారు. గడిచిన పదేండ్లలో తీసుకున్న చరిత్రాత్మక నిర్ణయాలతో సంస్థకు నష్టాలు తప్పినయ్. కష్టాలు తప్పినయ్ అంటూ కార్మికుల కడుపులోని 'అసలు ముచ్చట' చెప్తున్నరు. ఎస్సార్పీ-3 మైన్‌పై కార్మికుల ముచ్చట వారి మాటల్లోనే..





ఈ. గోపీక్రిష్ణ, బదిలీ వర్కర్

**మొన్ననే అసెంబ్లీ ఎన్నికలు అయినయ్.** కాంగ్రెసోళ్లు గెలిచింద్రు. మళ్లీ 27వ తారీఖు మన గుర్తింపు సంఘం ఎన్నికలు ఉంటయంట. ఏ మాటకు ఆ మాట చెప్పుకోవాలంటే సింగరేణి కోసం కొట్లాడింది బీఆర్ఎస్ సర్కార్ ఒక్కటే. దేశవ్యాప్తంగా బొగ్గగని కార్మికులను దేశ సరిహద్దుల్లో సైనికులుగా గుర్తించి ఆదాయ పన్ను రద్దు చేయాలని అసెంబ్లీలోనే తీర్మానం చేసి పంపింది మనోళ్లే. ఆదాయపు పన్ను రద్దుచేస్తే ఏడాదికి రూ.60వేల నుంచి రూ.4లక్షల వరకు కార్మికులకు ఆదా అయితది. దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 3.8 లక్షల కార్మికులకు మేలైతది. గింత మందికి మంచిజేసే ఆలోచన గతంలో ఎవ్వలు చేయలే. కేసీఆర్ ఒక్కడే చేసిండు. అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని ఆ కేంద్ర ప్రభుత్వం దేకుతలేదు. పైకెల్లి ఉన్న గనులను వేలం వేయాలని చూస్తున్నది. గట్ల మా పొట్టగొట్టే పని చేయాలని చూస్తున్న కేంద్రం కుట్రలను ఆపే శక్తి తెలంగాణ పార్టీకి తప్ప ఎవ్వరికీ లేదు. ఇక్కడున్న కాంగ్రెసోళ్లు, బీజేపోళ్లను నమ్మితే మాత్రం గనులు వేలం పాట పడుతరు. ఢిల్లీల ఉన్నోడు చెప్పినంక.. ఇక్కడున్నోడు అడ్డుకుంటడా.. ఆపుతడా..? గందుకే చెప్తున్న సింగరేణి కోసం కొట్లాడేది బీఆర్ఎసోళ్లే.. ఎన్నటికున్నా మనోళ్లు మనోళ్లైతరు గానీ మందోళ్లు మనోళ్లు ఎట్లైతరు..



షిరాజ్‌పాషా, జనరల్ మజ్దూర్

**అవ్ నర్సింగ్ కాక..** లాభాల్లా వాటా ఇచ్చుడు ఒక్కటేనానే.. కారుణ్య నియామకం ఇచ్చి నా బతుకును నిలబెట్టింద్రు.. మా నాయన రిటైర్మెంట్ అయినంక ఆ నౌకరి నాకు రాదని బాధపడిన. గప్పటికే కాంగ్రెసోళ్లు కారుణ్య నియామకాలను తీసేసి 24 ఏండ్లు అయితుండే. నాకు రావాల్సిన నాన్న ఉద్యోగం ఆగిపోయి ఆఖరికి నేను డ్రైవర్ పనిలో చేరిన. తెలంగాణ వచ్చినంక 2016లో దరఖాస్తులు పెట్టుకొమ్మన్నరు. గప్పుడు అప్లయ్ చేస్తే 2020లో నాన్న వారసత్వ ఉద్యోగం నాకు వచ్చింది. ఎప్పుడో పదేళ్ల క్రితం రావాల్సిన నౌకరి నాకు 30 ఏండ్ల వయసు వచ్చినంక వచ్చే. కేసీఆర్ చలువతోనే నేను మా కుటుంబం సంతోషంగా బతుకుతున్నాం. తెలంగాణ ప్రభుత్వం వచ్చినంక గీ నిర్ణయం తీసుకోకుంటే నాకు సింగరేణి నౌకరి వచ్చేది కాదు. సింగరేణిలో 12,500 మందికి కారుణ్య నియామకాలు ఇచ్చి, 2015 వరకు పెండింగ్‌లో ఉన్న 3,500 మందికి ఉద్యోగాలు కల్పించిన ఘనత తెలంగాణ సర్కార్‌కే దక్కుతది.



రాపెల్లి కుమార్, సపోర్ట్‌మన్

**మీరైతే చిన్న పిల్లలు..** మొన్ననే సింగరేణికి వచ్చినోళ్లు.. నేనైతే చాలా రోజుల సంది పని చేస్తున్న. ఒకప్పుడున్న సింగరేణి కట్టం గిప్పుడు లేదు. మొత్తం మారిపోయింది. మంచిగ పనిచేసుకోండి. ఒకప్పుడు కార్మికుడు కొత్తగా అపాయింటైతే. బదిలీ కోల్ ఫిల్లర్‌గా ఫస్ట్ పని ఇస్తుండే. వాడు రెగ్యులరైజ్ కోల్ ఫిల్లర్ కావడానికే ఐదారేండ్లు పట్టేది. బాస్కెట్ ఫిల్లింగ్ పని ఎంతో కట్టమైతుండే.. తట్టలో బొగ్గు నింపి నెత్తిన పెట్టుకొని డబ్బాలో పోసేది.. దాన్ని ఇప్పుడు తీసేశారు. గిప్పుడు మీకైతే 190 మస్టర్లు చేస్తే పర్మినెంట్ చేస్తున్నరు. ఒకప్పుడు అది లేదు.. కోల్ ఫిల్లర్ పని చేయలేక పారిపోయినోల్లు కూడా ఉన్నరు. ఇప్పుడు పని సులువైంది అందుకే నువ్వు అన్నట్లు ఐటీ జాబ్‌లు వదులుకొని వస్తుంద్రు. గిప్పుడు మన మైన్‌ల 70శాతం మంది ఉన్నత చదువులు చదివినోళ్లే ఉన్నరు. చివరకు అమ్మాయిలు కూడా పని చేస్తున్నరు. గంత మంచిగైంది సింగరేణి..



ముచ్చటించుకుంటున్న సింగరేణి కార్మికలు



దాసరి సదయ్య, ట్రామర్

**అబ్బా ఏం చెప్పినవ్ కుమారు..** ఎన్ని జేసింద్రు మన కోసం. గీ ప్రభుత్వంలో ఎవ్వలు ఊహించనివి కూడా చేసి చూపిచ్చింద్రు. అంబేద్కర్ జయంతి, క్రిస్మస్, రంజాన్, సంకాంత్రికి పీహెచ్‌డీ(పెయిడ్ హాలీ డే) ఇస్తున్నరు. తెలంగాణ వచ్చినంక 2014 వరకు కంపెనీ రోల్స్‌లో ఉన్న ప్రతి కార్మికుడికి తెలంగాణ ఇంక్రిమెంట్ ఇచ్చింద్రు.. తెలంగాణ కంటే ముందే ప్రత్యేక రాష్ట్రాలు ఎన్నో ఏర్పడినయ్. కానీ.. అక్కడున్న బొగ్గు గనుల్లో వాళ్లు ఏం చేయలే.. మనకైతే ఇంక్రిమెంట్ వేసింద్రు. 2011లో సకల జనుల సమ్మె చేసినం... 45 రోజులు పలుగు, పార పక్కన పెట్టి కొట్లాడినం... గా సమ్మె పీరియడ్‌కు కూడా జీతం ఇచ్చుడు ఒక మిరాకిల్ తెలుసా.. ఒకప్పుడు కార్మికులకు, వాళ్ల పిల్లలకు మాత్రమే కార్పొరేట్ వైద్య సదుపాయం ఉండే. ఇప్పుడు తల్లిదండ్రులను కూడా చేర్చింద్రు. కరెంట్ బిల్లులు మాఫీ చేసి.. సంస్థ అధికారులతో సమానంగా మనకు ఏసీ బిల్ కూడా ఇస్తున్నరు. కార్మికులు సచ్చిపోతే రూ.25 లక్షల మ్యాచింగ్ గ్రాంట్ ఇస్తున్నరు. కోలిండియాలోనే ఎక్కడా లేని సంక్షేమం సింగరేణి కార్మికులకు అందిస్తున్న గొప్ప రాష్ట్రం ఒక్క తెలంగాణనే.. గివన్నీ రాష్ట్రంలో బీఆర్ఎస్ ఉండబట్టిగనే అయినయ్. నేనైతే బీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘం(టీబీజీకేఎస్)కే ఓటు గుద్దుతా.. కుల్లంకుల్లా చెపుతున్న. షిఫ్ట్ టైం అయితాంది. ఇగ బాయిలకు పోదమ్ పాంద్రి..



దూల రాజేశం, టింబర్‌మన్

**నేను ఇల్లు కట్టుకుందమన్న** టైమ్‌కు నాకు రూ.10 లక్షల వడ్డీ లేని రుణం ఇచ్చింద్రు తమ్మి.. దానితోనే నేను తొందర ఇండ్లు కట్టుకోగలిగిన. రుణం బ్యాంక్ వాళ్లు మంజూరు చేస్తే యాజమాన్యమే దానికి సంవత్సరానికి రూ.50వేల వడ్డీ మాఫీ చేసుకుంట పోతున్నది. నా ఇల్లు నిలబడింది. ఇన్ని రోజులు కంపెనీ క్వార్టర్‌లో ఉన్నా.. ఇప్పుడు కంపెనీ సాయం తీసుకొని సొంతిల్లు కట్టుకున్న.. కేసీఆర్ శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంల సభ పెట్టి వడ్డీలేని పైసలు ఇస్తా అనంగనే ఇళ్లు కట్టాలనే ఆలోచన వచ్చింది. ఇదే పది లక్షలు బయట తెస్తే నెలకు రూ.20వేల మిత్తి అయ్యేటిది. ఇప్పుడా గోసంతా తప్పింది కదా.. ఇంతకుముందు దిగిపోయిన చాలా మంది కార్మికులు అప్పట్ల గీ స్కీమ్ లేక ఇల్లు కట్టుకోలేక పోయిన్రు. వాళ్లు ఇప్పుడు ఎంత గోస పడుతున్నరో మనం సూత్తున్నం కదా.. నాకు మల్లే సొంతిల్లు కావాలనుకునేటోల్లకు ఇది సానా ఉపయోగపడ్తది. తమ్మి.. మీరందరూ యువకులు కొలువు జేస్తున్నప్పుడే ఇండ్లు కట్టుకోండి. వడ్డీ మాఫీని ఉపయోగించుకోండి.



నర్సింగారావు, ట్రామర్

**అవునవును..**

కార్మికుల కష్టాలు తెలిసిన వ్యక్తి, ఉద్యమంలో కార్మికుల పోరాటాన్ని, తెగింపు చూసిన కేసీఆర్ సీఎం అయ్యాకే సింగరేణి బతుకు మారింది. ప్రతి ఏడాది కార్మికులకు లాభాల వాటా పెంచి ఇస్తున్నరు. ఈ ఏడాది 32 శాతం ఇచ్చిండు. 2000 సంవత్సరం నుంచి లాభాల వాటా 10శాతంతో ఇవ్వడంతోని మొదలుపెట్టింద్రు. గప్పుడున్న ప్రభుత్వాలు పెద్దగ పెంచలే. 2014 వచ్చినంక ఇచ్చింది 16శాతమే. కానీ తెలంగాణ వచ్చినంక 2014 నుంచి 2023 వరకు తొమ్మిదేళ్లలో 32 శాతానికి లాభాల వాటా తీసుకుపోయింద్రు. సంస్థ కష్టాల్లో ఉన్నా, లాభాలు తగ్గినా, పెరిగినా లాభాల వాటా ప్రతి ఏటా పెంచి ఇస్తుండడం చాలా సంతోషంగా ఉంది. దసరా, దీపావళికి ముందే లాభాల వాటా బ్యాంకుల వడుతున్నయ్. తక్కువల తక్కువ ఒకొక్కలికి రూ.వేల నుంచి రూ.మూడు లక్షల దాకా లాభాల వాట వచ్చింది. 2014కు ముందు రూ.20వేలు, రూ.30వేలు కూడా రాకపోయేది. ఒక్కొక్కసారి రూ.10 వేలు కూడా వచ్చిన సందర్భాలున్నయ్. తెలంగాణ రాకుంటే గింతగనం వచ్చేటియి కాదు.



వణదీప్, జనరల్ మజ్దూర్

**నువ్వు జెప్పినట్లే** నేను ఉపాయం చేస్తున్న అన్న.. మొన్నీ మధ్య చుట్టపోళ్లు ఇండ్లళ్లకు వచ్చినప్పుడు ఆడ కూడా ఇదే ముచ్చట వచ్చింది. కారుణ్య నియామకం కింద నాకు నౌకరి వచ్చింది. దిగుపోయే లోపు సొంతిల్లు కట్టుకుంటా.. నా అసోంటోళ్లు ఎంతో మంది కారుణ్య నియామకం కింద వచ్చినోళ్లు.. ఇప్పుడు మంచిగ బతుకుతుర్రు.. బీటెక్‌లు, ఎంటెక్‌లు, ఎంబీఏలు సదివి సాఫ్ట్‌వేర్ చేసినోళ్లు, మల్టీ నేషనల్ కంపెనీల్లో చేసినోళ్లు కూడా గిప్పుడు వచ్చి కారుణ్య నియామకం చేరుతున్నరు. ఒకప్పుడు బాయిపని గింత ఈజీగా ఏడుండే.. మా నాన్న నేను చేరుతా అన్నప్పుడు వొద్దు అన్నడు. గా పని నువ్వేడ జేస్తవ్ బిడ్డా.. తట్ట మోసుడు నీతోని కాదన్నడు. కానీ.. ఇప్పుడు తట్ట మోసుడు లేకపాయే.. మిషన్ ఎత్తిపోస్తున్నది గదా.. మిగిలిన పనులు పెద్ద రిస్క్ లేనివి అయ్యేసరికి అందరూ సింగరేణిలో పని ఎక్కాలనుకుంటున్నరు. తెలంగాణ వచ్చినంక బొగ్గుబాయి పని సులువైంది. కారుణ్య ఉద్యోగాలే గాకుండా.. సింగరేణి నౌకర్లలో గూడా 80 శాతం సింగరేణి ప్రాంతంలో ఉన్న యువతకే ఉద్యోగాలు కల్పించింద్రు.